

రోడ్డు కోసం బైఠాయించిన మాజీ కార్పొరేటర్ బొబ్బిలి సతీశ్, బస్తీ ప్రజలు

## రోడ్డు కోసం మాజీ కార్పొరేటర్ దీక్ష

కోల్‌సిటీ, మార్చి 3 : రామగుండం నగర పాలక సంస్థ 33వ డివిజన్‌లో రోడ్డు కోసం మాజీ కార్పొరేటర్ బొబ్బిలి సతీశ్ సోమవారం శాంతియుత దీక్ష చేపట్టాడు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నాలుగు గంటల పాటు ఎండలోనే బైఠాయించాడు. బస్తీవాసులు, మహిళలు ఆయనకు మద్దతుగా తరలి వచ్చి కూర్చున్నారు. రామగుండం ఎమ్మెల్యే గాని, నగర పాలక సంస్థ ప్రత్యేకాధికారి గాని, ఇన్‌చార్జి కమిషనర్ గాని వచ్చి హామీ ఇచ్చే వరకు దీక్ష విరమించేది లేదని భీష్మించుకుని కూర్చున్నాడు. అభివృద్ధి పనులు చేపట్టాలని అడిగితే నాయకులు తమనే భయభ్రాంతులకు గురి చేస్తున్నారని సతీశ్ వాపోయాడు. ఏదైనా ఆపద సమయంలో కనీసం అంబులెన్సు కూడా ఇక్కడకు వచ్చే దుస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. అదనపు కలెక్టర్ అరుణ శ్రీ ఆదేశాల మేరకు మున్సిపల్ డీఈ అక్కడకు చేరుకొని, పక్షం రోజుల్లో రోడ్డు వేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించాడు. అయితే గడువులోగా రోడ్డు వేయకపోతే డివిజన్ ప్రజలతో కలిసి మున్సిపల్ ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించాడు. నిరసన కార్యక్రమంలో బస్తీ వాసులు దివాకర్, తిరుపతి, ఎలసాని రాజయ్య, రామస్వామి, రవి, శ్రీనివాస్, వెంకటేశ్, శకుంతల, శారద, అన్నమ్మ, కళావతి, శ్రీలత, మధు, వజ్రమ్మ, లక్ష్మి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## మెరిట్ విద్యార్థులకు రోజ్ ఫౌండేషన్ చెక్కులు

రామగిరి, మార్చి 3: మంథని జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలోని సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సు (సీఎస్‌ఎం) చదువుతున్న ముగ్గురు మెరిట్ విద్యార్థులకు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ రోజ్ ఫౌండేషన్ చెక్కులు అందజేశారు. స్వచ్ఛంద సేవా సంస్థ, పిల్లలు, వృద్ధుల అనాథశ్రమం నిర్వహణతోపాటు కరోనా కాలంలో తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన రోజ్ ఫౌండేషన్ మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నది. ఇందులో భాగంగా మంథని జేఎన్‌టీయూ సీఎస్‌ఎం విద్యార్థులు సంజన, సాత్విక, శివకుమార్‌లకు రూ.10వేల చొప్పున చెక్కులను ప్రిన్సిపాల్ అందజేశారు. కార్యక్రమంలో సీఎస్‌ఈ ఫ్యాకల్టీ కే శ్రీనివాస్, పరిపాలనాధికారి సుమన్, ఫిజికల్ డైరెక్టర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## పత్తి క్వింటాలు గరిష్ఠ ధర రూ. 6861

పెద్దపల్లి, మార్చి3: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి క్వింటాలుకు గరిష్ఠ ధర రూ. 6861 పలికింది. సోమవారం మార్కెట్‌కు 252 మంది రైతులు 693 సంచుల్లో తీసుకవచ్చిన 762 క్వింటాళ్ల పత్తిని ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేశారు. కనిష్ఠ ధర రూ. 5361, గరిష్ఠ ధర రూ. 6861, మోడల్ ధర రూ. 6461 లభించిందని మార్కెట్ అధికారి తెలిపారు.

# ఆన్‌లైన్ ద్వారా 'మధ్యాహ్న భోజన' చెల్లింపులు

- రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా
- పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పైలట్ ప్రాజెక్టు అమలు

పెద్దపల్లి, మార్చి3 : ఆన్‌లైన్ ద్వారా మధ్యాహ్న భోజన చెల్లింపులకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం బిల్లుల చెల్లింపుపై హైదరాబాద్ నుంచి విద్యాశాఖ సంచాలకుల నరసింహారెడ్డితో కలిసి యోగితా రాణా జిల్లా కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పెద్దపల్లి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, డీఈవో డీ మాధవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ కార్యదర్శి మాట్లాడారు. ట్రెజరీ ద్వారా మధ్యాహ్న భోజన బిల్లుల చెల్లింపు ప్రక్రియ ఆలస్యమవుతుందని, నేరుగా ఆన్‌లైన్ నుంచే మధ్యాహ్న భోజనం బిల్లులు చెల్లించేందుకు గల అవకాశాలను విద్యాశాఖ పరిశీలిస్తున్నదని వివరించారు. రాష్ట్రంలో ముందస్తుగా పెద్దపల్లి, భద్రాద్రి




వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

కొత్తగూడెం జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లింపు ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. పెద్దపల్లి జిల్లాలో ఓ మండలాన్ని ఎంపిక చేసుకొని, నెల పాటు ఆ మండలం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన బిల్లులను ఆన్‌లైన్ ద్వారా చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పైలెట్ ప్రాజెక్టు నుంచి వచ్చే ఫలితాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ చెల్లింపులు చేసేందుకు ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. వీసీలో కలెక్టర్, డీఈవోతో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**చివరి ఆయకట్టుకు సాగునీరందించాలి**

యాసంగి పంటలో చివరి ఆయకట్టు వరకు రైతులకు సాగు నీరు అందేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి సూచించారు. యాసంగిలో సాగు నీటి సరఫరా, నీటి పారుదల శాఖ పని తీరుపై జిల్లా కలెక్టర్లతో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ సమీక్షించారు. పెద్దపల్లి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కోయ శ్రీహర్ష, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. యాసంగి పంట సంరక్షణకు రాబోయే పది రోజులు చాలా కీలకమని, అధికారులు అప్రమత్తంగా ఉంటూ సాగు నీరు, విద్యుత్ సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. వీసీలో కలెక్టర్‌తో పాటు డీఏవో దోమ ఆదిరెడ్డి, జిల్లా ఉద్యాన శాఖ అధికారి జగన్‌మోహన్‌రెడ్డి, పౌరసరఫరాల సంస్థ డీఎం శ్రీకాంత్, డీఎస్‌వో రాజేందర్,శ్రీకాంత్, ఎస్సీ ఎన్పీడీసీఎల్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.




ఎక్స్‌ప్రెస్, ఎలక్ట్రిక్ బస్సుల్లో పెద్దపల్లి - కరీంనగర్ బస్సు టికెట్ ధరల్లో వ్యత్యాసం

## ప్రయాణికులపై అదనపు భారం

- ఎలక్ట్రిక్ బస్సుల్లో గ్రీన్‌ట్యాక్స్ వసూలు

పెదపల్లి, మార్చి3: ఇటీవల టీజీఎస్ ఆర్టీసీ ప్రవేశ పెట్టిన ఎలక్ట్రిక్ బస్సుల్లో గ్రీన్ ట్యాక్స్ పేరిట ప్రయాణికులపై అదనపు భారాన్ని రుద్దుతున్నారు. ఎక్స్‌ప్రెస్ కన్న ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో అదనంగా రూ. 10 వసూలు చేస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే గ్రీన్‌ట్యాక్స్ అని కండక్టర్ చెబుతున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. టికెట్‌లో ఎక్కడ గ్రీన్ ట్యాక్స్ అని ముద్రించడం లేదని ఎందుకు ఎక్కువ తీసుకుంటున్నారని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. పెద్దపల్లి నుంచి కరీంనగర్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సు టికెట్ ధర రూ. 60 కాగా, ఎలక్ట్రిక్ ఎక్స్‌ప్రెస్ బస్సుకు మాత్రం రూ.70 వసూలు చేయడం అన్యాయమని ప్రయాణికులు మండిపడుతున్నారు.

## దొరకని పులి ఆచూకీ

- భయాందోళనలో మండల ప్రజలు

ముత్తారం, మార్చి 3: అడవిశ్రీరాంపూర్‌లోని నల్ల చెరువు ప్రాంతంలో ఆదివారం పులి సంచారం స్థానికులకు భయాందోళనకు గురి చేసింది. పులి జాడ కోసం సోమవారం ఉదయం నుంచి అటవీ పరిసర ప్రాంతాల్లో ఇద్దరు ట్రాకర్స్‌తో పాటు ఫారెస్టు అధికారులు గాలించారు. కానీ వారు గుర్తించిన చోట తప్ప మరెక్కడా పులిపాదముద్రలు కనిపించలేదని అధికారులు తెలిపారు. వేసవి కావడంతో గుర్తించడం కష్టంగా ఉందన్నారు. ఫారెస్టు అధికారులు చెప్పే వరకు అడవి ప్రాంతానికి పశువుల కాపరులు వెళ్లొద్దని సూచించారు. మంగళవారం కూడా అటవీ ప్రాంతంలో వెతకనున్నట్లు అధికారులు తెలిపారు. పులి జాడ తెలికయపోవడంతో మండల ప్రజలు, అటవీ పరిసర ప్రాంతాల రైతులు భయాందోళనకు గురవుతున్నారు. మండలంలోని మచ్చుపేట పరిధిలోని బహుగుళ్ల అటవీ ప్రాంతంలో 2022లో పులి సంచరించి ఓ ఆవును కూడా చంపివేసిన సంఘటన అప్పుడు భయాందోళనకు గురిచేసింది. మళ్లీ అలాంటి సంఘటనలు ఏమైనా జరుగవచ్చునేమోనని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అధికారులు పులికి సంబంధించిన పూర్తి సమాచారం తెలపాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఇక్కడ సెక్షన్ ఆఫీసర్లు నర్సయ్య, అఫ్జల్ అలీ, సోనీ కిరణ్, బీట్ ఆఫీసర్లు రాం సింగ్, శ్రీకాంత్, ట్రాకర్స్ రాజేశ్, నరేందర్ పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

### గాయత్రి విద్యానికేతన్ వార్షికోత్సవం

పెద్దపల్లి, మార్చి3: జిల్లా కేంద్రంలోని గాయత్రి విద్యానికేతన్ వార్షికోత్సవం (ఆనందోత్సవ్ – ఏ ఫెస్టివల్ ఆఫ్ జాయ్)ను ఆర్య వైశ్యభవన్‌లో ఘనంగా నిర్వహించారు. అక్షర గణిత అష్టావధాని పుల్లూరి ప్రభాకర్‌తో కలిసి విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్, కరస్పాండెంట్ రజనీ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు నృత్యాలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో రజియొద్దీన్, లింగేశ్వర్, సృజన, స్రవంతి, రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు

సుల్తానాబాద్ రూరల్,మార్చి 3: అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు అన్నారు. కాట్నపల్లిలో సోమవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామన్నారు.కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, ఏఎంసీ చైర్మన్ ప్రకాశ్ రావు, విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

### కలెక్టరేట్‌లో నేతకాని కులస్తుల దీక్ష

పెద్దపల్లిటౌన్, మార్చి 3: ఎస్సీ వర్గీకరణకు నేతకాలనీలకు ప్రత్యేక గ్రూప్ కేటాయించాలని కోరుతూ పెద్దపల్లి కలెక్టరేట్ వద్ద నేతకాని మహార్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం శాంతియుత దీక్ష చేపట్టారు. ఏజెన్సీ నేతకానీలకు హక్కులు కల్పించాలని, ఎస్సీ రిజర్వేషన్‌ను 15 నుంచి 20శాతానికి పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కామెర ప్రకాశ్, అధ్యక్షుడు దుర్గం రాజేశ్, జిల్లా నాయకులు గోలే లక్ష్మణ్, కుమ్మరి మల్లేశ్, మాదాసు సుధాకర్, లక్ష్మయ్య, లింగయ్య, చిన్న లక్ష్మయ్య, కొమురయ్య, ఓదెలు, శంకరయ్య ఉన్నారు.

### చిన్నరాత్‌పల్లిలో చోరీ

కాల్వశ్రీరాంపూర్, మార్చి 3: మండలంలోని చిన్నరాత్‌పల్లిలో మద్దెల రాజేందర్ ఇంట్లో ఎవరూలేని సమయంలో దొంగలు తొమ్మిదిన్నర తులాల బంగారం, 8 తులాల వెండి పట్టీలు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం అదే గ్రామంలో ఓ పెండ్లి ఉండగా రాజేందర్ కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి వెళ్లారు. వివాహానంతరం రాజేందర్ భార్య మంగ ఇంటికి వెళ్లగా తాళం పగలగొట్టి తలుపులు తీసి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో దాచుకున్న బంగారం, వెండి పట్టీలు దొంగలు ఎత్తుకెళ్లారని గుర్తించింది. విషయం తెలుసుకున్న పోలీసులు బాధితుల నుంచి వివరాలు సేకరించారు. సంఘటనా స్థలానికి సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐ వెంకటేశ్, డాగ్ స్క్వాడ్స్, క్లూస్ టీం బృందం వెళ్లి వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### కార్మికులపై వేధింపులు మానుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 3 : సింగరేణి సంస్థ ఆర్జీ–2 ఏరియాలోని ఓసీపీ–3 ప్రాజెక్టు సీహెచ్‌పీలో అధికారులు కార్మికులపై వేధింపులు మానుకోవాలని ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి జీ రవీందర్ సూచించారు. సోమవారం సీహెచ్‌పీలో కార్మికులను కలుసుకొని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఒక ఇంజినీర్, ఫోర్‌మెన్ కార్మికులను వేధిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కార్మికులు తమ దృష్టికి తీసుకవచ్చినట్లు తెలిపారు. వారు తమ వైఖరి మార్చుకోవాలన్నారు. ఇప్పటికైనా జీఎం ఈ విషయంపై దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట కేంద్ర కార్యదర్శి రాజారత్నం, ఉపాధ్యక్షులు అన్నారావు, శ్యాంసన్, సాంబశివరావు, శంకర్, రమేశ్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, తిరుపతి, రత్నం,సురేశ్, సంపత్ ఉన్నారు.

### నిరుపేద యువతి పెళ్లికి సాయం

జ్యోతినగర్, మార్చి 3: ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీకి చెందిన నిరుపేద కుటుంబం తాళ్లపెల్లి దుర్గయ్య–విజయ దంపతుల పెద్ద కూతురు తాళ్లపెల్లి కరుణ పెళ్లికి స్థానిక శ్రీ సీతారామ సేవాసమితి అండగా నిలిచింది. ఈ మేరకు కరుణ పెళ్లి ఈ నెల 12న నిశ్చయం కాగా, ఆ కుటుంబం దాతల సాయం కోరింది. సేవాసమితి స్పందించి విరాళాలు సేకరిస్తున్నారు. ఆలయ ఫౌండేషన్ రూ. 5వేలు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ రూ. 2వేలు, కరీంనగర్‌కు చెందిన విజయలక్ష్మీ తన స్నేహితుల నుంచి రూ. 20వేల ఖరీదు చేసే పెళ్లిబట్టలు సేకరించి శనివారం పెళ్లి కూతురుకు అందజేశారు. నిరుపేద యువతి పెళ్లికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఇక్కడ సీతారామ సేవా సమితి సభ్యులు గోలివాడ చంద్రకళ, కంది సుజాత, తదితరులు ఉన్నారు.

### సింగరేణి ఉద్యోగి కుమార్తెకు గోల్డ్ మెడల్

రామగిరి, మార్చి 3: సెంటినరీకాలనీకి చెందిన సింగరేణి ఉద్యోగి రవీందర్ కుమార్తె డాక్టర్ ప్రవళిక ఉన్నత విద్యలో గోల్డ్ మెడల్ సాధించింది. మధ్యప్రదేశ్‌లోని నానాజీ దేశ్‌ముఖ్ వెటర్నరీ సైన్స్ యూనివర్సిటీలో మాస్టర్స్ పూర్తి చేసి విశ్వ విద్యాలయ స్థాయిలో టాపర్‌గా నిలిచి గోల్డ్‌మెడల్ అందుకున్నారు. ఇటీవల జరిగిన యూనివర్సిటీ ఏడో స్నాతకోత్సవంలో మధ్యప్రదేశ్ గవర్నర్ మంగుబాయ్ పటేల్, విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సలర్ బంగారు పతకం ప్రదానం చేశారు .

### 8న మహిళా దినోత్సవం

గోదావరిఖని, మార్చి 3: ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సింగరేణి ఆర్జీ–1 సేవా అధ్యక్షురాలు అనిత లలిత్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక జీఎం కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా ఉద్యోగులు, సేవాసమితి శిక్షకులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. సింగరేణి మహిళా ఉద్యోగులు, గృహిణులకు ఈ నెల 6న వివిధ రకాల ఆటల పోటీలు స్థానిక జీఎం కాలనీ క్రీడా మైదానంలో ఉంటాయని తెలిపారు. 8న స్థానిక ఆర్‌సీవోఏ క్లబ్‌లో అత్యున్నత సేవలందించిన మహిళలకు సన్మానం, సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఇక్కడ డీజీపీ పర్సనల్ కిరణ్‌బాబు, పీవో హన్మంతరావు, సేవా సంయుక్త కార్యదర్శి బీనాసింగ్, ఏఐటీయూసీ ప్రతినిధి పద్మ, కోఆర్డినేటర్లు తిరుపతి, రవికుమార్ ఉన్నారు.

### పరామర్శ

జూలపల్లి, మార్చి 3 : వడ్కాపూర్ గ్రామానికి చెందిన జెట్టి రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ బీఆర్‌ఎస్ కార్యకర్తలతో కలిసి సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. 'నేనున్నా' స్వచ్ఛంద సేవా సంస్థ తరపున బియ్యం అందజేశారు. ఇక్కడ నాయకులు కన్నం రమేశ్, పుల్లూరి రాజేశ్వర్ రావు, కనకట్ల స్వామి, గుమ్మడి స్వామి, జెట్టి నర్సింగం, గుర్రం లచ్చయ్య, అరికొల్ల మల్లేశం, ఆరెల్లి మొగిలి, లక్ష్మణ్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

CHANGE OF NAME
★Reddaveni Pravalika W/o Reddaveni Sudheer Kumar, (Old Name), H.No. 12-7-117/1, Shiva Nagar, Sircilla Town & Mandal, Rajanna Sircilla Dist. My Name changing as per my Certificates, Garige Pravalika W/o Reddaveni Sudheer Kumar (New Name)
NTK-00000

CHANGE OF NAME
★Kairamkonda Rekha, W/o Kairamkonda (Old Name) Srikanth D/o Myaka Pochaiah, H.No. 7-60/6, Vill & Mdl: Thangallapally, Rajanna Sircilla Dist. My Name was changed to Myaka Neeraja (New Name)
NTK-00000

LOST
నేను మోర సత్యంబాబు @ మోర సత్యనారాయణ, తండ్రి: హనుమయ్య, నివాసం: గోదావరిఖని, మా ఇంటి నుంచి బైక్ మీద బస్టాండ్ (గోదావరిఖని) వెళ్తుండగా తేదీ: 06-02-2025 రోజున నా ఒరిజినల్ భూమి డాక్యుమెంట్ (కోహెడ గండి చెరువు వద్ద సర్వే నెం. 196 లోని 200 చ.గల. భూమి ప్లాట్ నెం. 299, డాక్యుమెంట్ నెం: 333/2000) పోయినది. దొరికిన వారు సంప్రదించగలరు: 7997662022.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

## మున్సిపల్ వార్డు అధికారుల పే స్కేల్ సవరించాలి

- పీఆర్సీ కమిషన్ కమిషనర్‌కు పోస్ట్ కార్డులు

పెద్దపల్లి, మార్చి3: మున్సిపల్ శాఖలో గ్రూప్ –4 ద్వారా నియామకమైన వార్డ్ ఆఫీసర్లు తమ పే స్కేల్ సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు పీఆర్సీ కమిషన్ కమిషనర్‌కు పోస్ట్ కార్డుల ద్వారా విజప్తి చేశారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో వార్డు అధికారి అనే నూతన పోస్టును ఏర్పాటు చేసి జీవో 109 (జూలై 2000) ద్వారా గ్రూప్–4లో 1862ను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గ్రూప్–4 ద్వారా నియమితులయ్యారంటే జానియర్ అసిస్టెంట్ కేడర్ ఉంటుందని కొత్తగా నియమితులైన వార్డు ఆఫీసర్లు చెబుతున్నారు. డిగ్రీ ఉత్తీర్ణులైన వారు గ్రూప్ –4 ద్వారా నియాకమైన వార్డు అధికారులకి జానియర్ అసిస్టెంట్‌కు ఇస్తున్న పే స్కేల్ (రూ. 24,250 – రూ. 72,850) వార్డు ఆఫీసర్ పే స్కేల్ (రూ. 22.240 – రూ. 5, 67,300). ఇంటర్ అర్హతతో ఇచ్చే రికార్డు అసిస్టెంట్ స్కేల్‌ని డిగ్రీ అర్హతతో ఇస్తున్నారని పెద్దపల్లి వార్డు ఆఫీసర్లు



వార్డు అధికారులు పంపిన పోస్టు కార్డులు

పేర్కొన్నారు. తమ పేస్కేల్‌ని సవరించాలని కోరుతూ సోమవారం పీఆర్సీ కమిషన్ చైర్మన్‌కు పోస్టుకు కార్డులు పంపారు. సమాన విద్యార్హతతో ఒకే నియామక పరీక్ష రాసి, ఎంపికైన వారికి ఈ వ్యత్యసం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. తమ సమస్యపై పీఆర్సీ కమిషన్‌కు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఉత్తరాలు పంపిస్తున్నట్లు తెలిపారు. టీఎన్జీవో నాయకులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని రాష్ట్ర నాయకత్వాన్ని కోరారు. రెవెన్యూ శాఖ నుంచి వచ్చిన వార్డు అధికారులకు, గ్రూప్ –4 ద్వారా నియామకమైన వార్డు ఆఫీసర్ల పే స్కేల్‌లో వ్యత్యాసం ఎందుకని ప్రశ్నించారు.

## ఆత్మహత్య చేసుకుంటానని ట్యాంక్ ఎక్కిన యువకుడు

**అదుపు తప్పి కిందపడి మృతి**

ఫర్టిలైజర్‌సిటీ, మార్చి 3: ఆత్మహత్య చేసుకుంటానని వాటర్ ట్యాంక్ ఎక్కిన ఓ యువకుడు బెదిరింపులకు పాల్పడుతూ అదుపు తప్పి కిందపడి ప్రాణాలు కోల్పోయిన సంఘటన గోదావరిఖనిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. అంబేద్కర్‌నగర్‌కు చెందిన యతిరాజ్ చంద్రశేఖర్(35) మద్యం షాపు వద్ద కొందరు తనతో దరుసుగా ప్రవర్తించారని, వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాడు. పోలీసులు ఫిర్యాదు ఇవ్వాలని సూచించారు. తనకు న్యాయం జరగడం లేదని చంద్రశేఖర్ స్థానిక జవహర్‌నగర్‌లోని సింగరేణి వాటర్ ట్యాంక్‌పైకి ఎక్కి కొద్ది సేపు హంగామా చేశాడు. స్థానికులు, పోలీసులు నచ్చచెప్పినా వినకుండా ట్యాంకు ఓవర్ ఫో పైపుపై కూర్చున్నాడు. ఒక్కసారిగా పట్టు తప్పడంతో కిందపడిపోయాడు. తీవ్ర గాయాలైన చంద్రశేఖర్‌ను వెంటనే గోదావరిఖని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి చనిపోయాడని వైద్యులు తెలిపారు. మృతుడు తెలంగాణ కళాకారుడు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నాడు. మృతుడి ఛాతిపై కోరుకంటి చందర్ చిత్రపటం పచ్చబొట్టు ఫోటో, ఎడమచేతిపై జై తెలంగాణ అని రాసిన పచ్చబొట్టు ఉంది. మృతుడికి తల్లి గంగవ్వ, ఇద్దరు సోదరులు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు కేసునమోదు చేసుకోని విచారణ చేపట్టారు. ఈ మేరకు దవాఖానకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ మృతుడి తల్లిని ఓదార్చారు. ఇక్కడ మున్సిపల్ మాజీ కార్పొరేటర్లు పెంటరాజేశ్, ఇంజపూరి పులేందర్ ఉన్నారు.

**కేసు నమోదు**

చంద్రశేఖర్ మృతికి కారణమైన వ్యక్తిపై గోదావరిఖని వన్‌టౌన్ ఎస్ఐ రమేశ్ కేసునమోదు చేశారు. ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ఓ మద్యం షాపులో జరిగిన గొడవలో చంద్రశేఖర్‌ను మద్యం షాప్‌లో పనిచేసే రమేశ్ అనే వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. దీంతో మనస్తాపం చెందిన చంద్రశేఖర్ వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి వదిన గౌసియా ఫిర్యాదు మేరకు రమేశ్‌పై 108 బీఎన్ఎస్ కింద కేసునమోదు చేశారు. కాగా చంద్రశేఖర్ ముందుగా తనకు జరిగిన అన్యాయంపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి తనకు న్యాయం చేయాలని పోలీసులను కోరినా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇవ్వక పోవడంతోనే వారు పట్టించుకోలేదు. ఒకవేళ పోలీసులు తక్షణమే స్పందించి ఈ ఘటనపై కౌన్సిలింగ్ చేపడితే చంద్రశేఖర్ బతికి ఉండేవాడని స్థానికులు చర్చించుకుంటున్నారు.


## కల్వచర్ల వద్ద వరుస రోడ్డు ప్రమాదాలు

రామగిరి, మార్చి 3 : మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి కల్వచర్ల లోని బొక్కల వాగు దగ్గర సోమవారం వరుసగా రెండు వేర్వేరుగా ప్రమాదాలు జరిగి పలువురికి తీవ్ర గాయలయ్యాయి. పెద్దపల్లి వైపు నుంచి వస్తున్న కారు బొక్కలవాగు వంతెన దాటిన తరువాత అదుపు తప్పి పల్టీలు కొడుతూ పక్కనే ఉన్న పొలంలో పడింది. అందులో ప్రయాణిస్తున్న సెంటినరీకాలనీకి చెందిన నలుగురికి సల్ప గాయాలయ్యాయి. కాగా స్థానికులు చికిత్స కోసం పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అలాగే మరో ఘటనలో కారు స్కూటీని ఎదురెదురుగా ఢీకొన్నది. ఈ ప్రమాదంలో స్కూటీపై ప్రయాణిస్తున్న కల్వచర్ల గ్రామానికి చెందిన అలిగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని కుటుంబ సభ్యులు చికిత్స కోసం పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు కరీంనగర్ దవాఖానకు తీసుకెళ్లారు. రామగిరి ఠాణా పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

## కొనసాగుతున్న 'ఎల్లంపల్లి' ఎత్తిపోతలు

- నారాయణపూర్ రిజర్వాయర్‌కు నంది నుంచి 247 క్యూసెక్కుల నీటి తరలింపు

ధర్మారం,మార్చి 3:శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి ధర్మారం మండలం నంది మేడారంలోని నంది రిజర్వాయర్‌లోకి అండర్ గ్రౌండ్ పైపులైన్ ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి.ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు చేపట్టాలని ఆదేశాల మేరకు వేంనూర్ పంప్‌హౌస్ నుంచి జనవరి 16 నుంచి నీటి ఎత్తి పోతలను ప్రాజెక్ట్ ఇంజినీరింగ్ అధికారులు మొదలు పెట్టగా అక్కడి పంప్‌హౌస్‌లోని నాలుగు మోటర్లు మొరాయించాయి. దీంతో గత్యంతరం లేక అదే నెలలో పలు దఫాలుగా ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నీటిని లింక్ –2 ద్వారా కాళేశ్వరం ప్రాజెక్ట్ అనుబంధ నంది పంప్‌హౌస్ –1 మోటర్‌ను ఆన్‌చేసి 3,150 క్యూసెక్కుల చొప్పున నీటిని నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోసి నారాయణపూర్‌కు నంది రిజర్వాయర్‌కు అనుబంధంగా ఉన్న ఎల్లంపల్లి పంప్‌హౌస్



నంది రిజర్వాయర్‌లోకి పైపులైన్ ద్వారా వస్తున్న నీరు

ద్వారా తరలించారు. వేంనూర్ పంప్‌హౌస్‌లో నాలుగు మోటర్లను ఇంజినీరింగ్ అధికారులు మరమ్మతులు పూర్తి చేయించారు. ఒక మోటర్‌ను ఆన్‌చేసి రెండు వారాలుగా నంది రిజర్వాయర్‌లోని ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నీటిని 247 క్యూసెక్కుల చొప్పున పైపులైన్ ద్వారా పంపింగ్ చేస్తున్నారు.ఇక్కడి నుంచి అదే పరిమాణంలో నారాయణపూర్ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తున్నారు. ఆ రిజర్వాయర్ నుంచి ఎగువ ప్రాంతానికి నీటిని పంటలకు సరఫరా చేస్తున్నారు. నంది రిజర్వాయర్ ఎఫ్ఆర్ఎల్ 233 మీటర్లు కాగా ప్రస్తుతం 227.2 మీటర్ల వరకు నీటి మట్టం ఉందని ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ఈఈ స్వామి, డీఈఈ బుచ్చిబాబు తెలిపారు.

### 5 నుంచి ఇంటర్ పరీక్షలు

కాల్వశ్రీరాంపూర్, మార్చి 3: ఈనెల 5 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల చీఫ్ సూపరిండెంట్ కే బాలరాజు సోమవారం తెలిపారు. కాల్వశ్రీరాంపూర్ జూనియర్‌కళాశాలలో ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులు 307 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. ఉదయం 9 నుంచి 12గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు ఉదయం 8 గంటలకే కళాశాలకు చేరుకోవాలని సూచించారు.

జూలపల్లి, మార్చి 3 : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహన కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జూలపల్లి, పెద్దాపూర్, తేలుకుంటలోని కళాశాలల నుంచి ఫస్టియర్‌లో 270, సెకండియర్‌లో 260 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. జూలపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి 286, పెద్దాపూర్ మోడల్ స్కూల్‌లో 156, తేలుకుంట కేజీబీవీ నుంచి 88 మంది పరీక్షల రాయనున్నారు. ఈ నెల 5 నుంచి 25 దాకా పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, నిమిషం ఆలస్యమైనా అనుమతి లేదని చీఫ్ సూపరింటెండెంట్ విశ్వప్రసాద్, డీవో శంకరయ్య వెల్లడించారు.

### క్రికెట్ పోటీల బ్రోచర్ విడుదల

రామగిరి, మార్చి 3: జేఎన్‌టీయూ (హైదరాబాద్)కు అనుబంధంగా ఉన్న బీ జోన్ స్థాయి క్రికెట్ పోటీల బ్రోచర్‌ను సోమవారం స్థానిక జేఎన్‌టీయూ కళాశాలలో ప్రిన్సిపాల్ బీ విష్ణువర్ధన్ విడుదల చేశారు. ఈ నెల 6 నుంచి లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహించనున్నారు. గతంలో కళాశాలలో చదువుతూ క్రికెట్ టీమ్‌కు ప్రాతినిథ్యం వహించిన విద్యార్థులు, కళాశాల యాజమాన్యం ఆర్థిక సాయం అందిస్తున్నది. ఈ పోటీల్లో ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంనగర్ జిల్లాలకు చెందిన జేఎన్‌టీయూ యూనివర్సిటీ అనుబంధ ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు పాల్గొనున్నారు. బయటి కళాశాలల టీంలకు ఉచితంగా భోజనం, వసతి కల్పించనున్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి సుమన్, ఫిజికల్ డైరెక్టర్లు పింగిళి కృష్ణారెడ్డి, సునీల్, నిర్వాహకులు కార్తికేయ, నిఖిల్, విద్యార్థులు పాల్గొన్నారు.

### మహిళా ఫొటోగ్రాఫర్ మృతి

గోదావరిఖని, మార్చి 3: గోదావరిఖనిలో తొలి తరం మహిళా ఫొటో గ్రాఫర్‌గా రాణించిన గూడూరి సుశీలాదేవి(65) సోమవారం ఉదయం ఆనారోగ్యంతో చనియారు. సుశీలా దేవి పట్టణంలో ప్రముఖ నవోదయ ఫొటో స్టూడియా నిర్వాహకుడు శ్యామ్ సుందర్ భార్య. వీరి కుమారులు పవన్‌కుమార్, నవీన్‌కుమార్ కూడా ఫొటోగ్రాఫర్లుగా రాణిస్తున్నారు. సుశీలాదేవి మృతితో పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సీనియర్ జర్నలిస్టు ఎస్‌కుమార్, గోదావరిఖని ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులతో పాటు పలువురు ప్రతినిధులు సుశీలాదేవి మృతదేహం వద్ద నివాళులర్పించారు.

### పెట్రోల్ తీసుకెళ్తుండగా కాలి బూడిదైన బైక్

మంథని, మార్చి 3: క్యాన్‌లో పెట్రోల్ తీసుకొని వెళ్తుండగా బైక్ కాలి బూడిదైంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అడవి సోమనపల్లి గ్రామానికి చెందిన గట్టు శ్రీనివాస్ మంథనిలోని ఓ బంక్ నుంచి క్యాన్‌లో 20 లీటర్ల పెట్రోలు తీసుకొని తన బైక్ వెనుక ఉన్న హ్యాండిల్‌కు తగిలించారు. తన గ్రామానికి తరలిస్తుండగా సైలెన్సర్‌కు పెట్రోల్ క్యాన్ తగిలి నిప్పు అంటుకుంది. దీంతో వెనకాల వచ్చే వాహనాదారులు కేకులు వేసి అప్రమత్తం చేయడంతో శ్రీనివాస్ బైక్‌ను పడేసి పక్కకు దూకాడు. దీంతో పెట్రోల్ ధాటికి బైక్ పూర్తిగా మంటల్లో కాలిపోయింది. బైక్ నడుపుతున్న గట్టు శ్రీనివాస్‌కు ఏమి కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

### జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక

కోల్‌సిటీ, మార్చి 3: గోదావరిఖనికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి తాడబోయిన మురళి జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో 286 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ఆలిండియా సివిల్ సర్వీసెస్ స్విమ్మింగ్ టోర్నమెంట్‌లో పాల్గొనే అవకాశం దక్కింది. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల నుంచి 13 మంది ఉద్యోగులు ఎంపిక కాగా, ఉమ్మడి కరీంనగర్ నుంచి మురళి ఒక్కడే ఎంపిక కావడం విశేషం. ఇటీవలే హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో 200 మీటర్ల బ్యాక్ స్ట్రోక్‌లో ప్రతిభ చాటాడు. ఈనెల 5 నుంచి 7 వరకు గుజరాత్‌లోని గాంధీనగర్‌లో నిర్వహించనున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ స్విమ్మింగ్ జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు కోచ్ కృష్ణమూర్తి తెలిపారు.